# రాత్రి వరకూ పోలింగ్

- ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు
- సైదాపూర్, చిగురుమామిడిలో స్వల్ప ఘర్షణలు

కరీంనగర్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంగా ముగిశాయి. గురువారం ఉదయం నుంచే ఓట్లు వేసేందుకు ఓటర్లు కేంద్రాలకు తరలి వచ్చారు. ఉదయం కొంత మందకొడిగా ఓటింగ్ జరిగినా మధ్యాహ్నం వరకు పుంజుకున్నది. జిల్లాలో రెండు చోట్ల స్వల్పంగా ఘర్షణలు జరగడం, మరో రెండు చోట్ల ఈవీఎంలు మొరాయించడం మినహా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ఎదురు కాలేదు. కాగా జిల్లాకు చెందిన ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పలు కేంద్రాల్లో సాయంత్రం ఓటర్లు కేంద్రాల్లో బారులు తీరి నిల్చోవడం కనిపించింది.

### బారులు తీరిన ఓటర్లు

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో బారులు తీరి కనిపించారు. మధ్యాహ్నం కొంత మందకొడి అనిపించినా సాయంత్రం నాలుగు గంటలకు ఒక్కసారి ఆయా కేంద్రాలకు ఓటర్లు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో పనులకు వెళ్లిన వారంతా ఈ సమయంలోనే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కరీంనగర్ నగరంలోని పలు డివిజన్లలో కూడా ఓటర్లు బారులు తీరి కనిపించారు. నగరంలోని కిసాన్ నగర్‌లో, కాపువాడలో రెండు ఈవీఎంలు మొరాయించాయి. సైదాపూర్ మండలంలోని రాయికల్‌లో పోలీసులు, గ్రామస్తులకు మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా పోలీసులు గ్రామస్తులపై స్వల్ప లాఠీచార్జి చేశారు. పలువురు బీఆర్ఎస్ నాయకులకు గాయాలయ్యాయి. చిగురుమామిడి మండల కేంద్రంలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించేందుకు వచ్చిన హుస్నాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితెల సతీశ్‌కుమార్‌తో స్థానికులు వాగ్వాదానికి దిగారు. దీంతో ఇక్కడ కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య స్వల్ప గొడవ జరిగింది. కాంగ్రెస్‌కు మద్దతుగా ఉన్న జడ్పీటీసీ సభ్యుడు గీకురు రవిందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని ఎన్నికలు ముగియగానే వదిలేశారు. సీపీ అభిషేక్ మహంతి జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని, కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు.. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేల సత్పతి ఎన్నికల సరళిని నిత్యం పర్యవేక్షించారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కొన్ని చోట్ల రాత్రి వరకు పోలింగ్ జరిగింది. సాయంత్రం 5 గంటల వరకు కేంద్రంలో ఉన్న ప్రతి ఒక్కరితో అధికారులు ఓట్లు వేయించారు.



కరీంనగర్ : సప్తగిరికాలనీలో ఓటు వినియోగించుకున్న యువత

### గంట గంటకూ భారీగా పెరిగిన ఓటింగ్

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఉదయం మందకొడిగా సాగిన పోలింగ్ 11 గంటల తర్వాత గంట గంటకూ ఊపందుకున్నది. కరీంనగర్‌లో ఉదయం 9 గంటల వరకు 6.13 శాతం, 11 గంటల వరకు 14.06 శాతం, మధ్యాహ్నం1 గంట వరకు 38.90 శాతం, 3 గంటల వరకు 53.71 శాతం, సాయంత్రం 5 గంటల వరకు 64.17 శాతం పోలింగ్ నమోదైంది. చొప్పదండి నియోజకవర్గంలో ఉదయం 9 గంటల వరకు 12.45 శాతం, 11 గంటల వరకు 24.32 శాతం, మధ్యాహ్నం 1 గంట వరకు 39.34 శాతం, 3 గంటల వరకు 54.15 శాతం, సాయంత్రం 5 గంటల వరకు 70.25 శాతం మంది ఓటేశారు. మానకొండూర్‌లో ఉదయం 9 గంటల వరకు 10 శాతం, 11 గంటల వరకు 26.74 శాతం, మధ్యాహ్నం 1 గంటల వరకు 44.38 శాతం, 3 గంటల వరకు 62.75, సాయంత్రం 5 గంటల వరకు 75.12 శాతం పోలింగ్ నమోదైంది. హుజూరాబాద్‌లో ఉదయం 9 గంటల వరకు 5.36 శాతం, 11 గంటల వరకు 18.03 శాతం, మధ్యాహ్నం 1 గంట వరకు 41.40 శాతం, 3 గంటల వరకు 55.16 శాతం, సాయంత్రం 5 గంటల వరకు 70.23 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.



కరీంనగర్‌లోని సప్తగిరికాలనీ హైస్కూల్‌లో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

### స్ట్రాంగ్ రూంలకు ఈవీఎం యంత్రాలు

జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు రాత్రి పొద్దు పోయే వరకు పోలింగ్ జరిగింది. అయితే, డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో స్థానిక ఎస్ఆర్ఆర్ కళాశాలలో అధికారులు స్ట్రాంగ్ రూంలు ఏర్పాటు చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు తమకు కేటాంచిన ఈవీఎం మిషన్లను రాత్రి పొద్దు పోయే వరకు స్ట్రాంగ్ రూంలకు తరలించారు. జిల్లా ఎన్నిల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో స్ట్రాంగ్ రూంలో వీటిని భద్రపర్చారు. మూడంచెల పద్ధతిలో స్ట్రాంగ్ రూంలకు పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు.

## విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

మానకొండూర్ రూరల్, నవంబర్ 30 : మండలంలోని గంగిపల్లి గ్రామానికి చెందిన గాడిచర్ల స్వరూప-శ్రీనివాస్‌ల కొడుకు గాడిచర్ల అజయ్ కుమార్ (14) గురువారం సాయంత్రం విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సాయంత్రం పొలం దగ్గర నారుమడికి నీళ్ల కోసం పెట్టిన మోటర్ పంప్‌ను బంద్ చేసేందుకు ఇంటి నుంచి వెళ్లాడని, స్విచ్ బంద్ చేసేందుకు డబ్బాను తీసే క్రమంలో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే కిందపడిపోయినట్లు తెలిపారు. గమనించిన స్థానికులు వెంటనే స్థానిక ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లి ఫస్ట్ ఎయిడ్ చేయించే ప్రయత్నం చేశారని, కానీ అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. కాగా, ఈ దంపతులకు పిల్లలు కాకపోవడంతో అజయ్ కుమార్‌ను దత్తత తీసుకొచ్చుకొని పెంచుకుంటున్నారు. తర్వాత కొన్నేళ్లకు ఈ దంపతులకు ఇద్దకు కూతుళ్లు జన్మించారు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు మరణించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అజయ్ కుమార్ కేశవపట్నంలో ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

## విజయం మనదే

- బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్ కల్వకుట్ల

మెట్‌పల్లి, నవంబర్ 30: కోరుట్ల నుంచి తన గెలుపు తథ్యమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల సంజయ్ దీమా వ్యక్తం చేశారు. గురువారం మెట్‌పల్లి పట్టణంలోని 215 పోలింగ్ బూత్‌లో తన తండ్రి, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుతో కలిసి ఓటు హక్కును వినియోగించున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉదయం నుంచే వృద్ధులు, యువకులు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారని, పనిచేసే ప్రభుత్వానికి గెలిపించుకోవాలనే సంకల్పంతో ఓటు వేసేందుకు కేంద్రాల వద్ద బారులు తీరినట్లు చెప్పారు. మంచి విద్య, వైద్యం, మంచి భవిష్యత్ కోసం మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే రావాలనే ఆకాంక్ష, తపన ఓటర్లలో కనిపించిందన్నారు. ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# ఓటెత్తారు.. చైతన్యం చూపారు

- జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో ప్రశాంతంగా ఎన్నికలు
- 74.87 శాతం పోలింగ్
- ఉదయం నుంచి బారులుతీరిన ఓటర్లు
- ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు



కొడిమ్యాలలో నాయకులతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి రవిశంకర్

జగిత్యాల, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): జిల్లాలో శాసన సభ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లో ఉదయం ఏడు గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కాగా, పలుచోట్ల రాత్రి వరకూ కొనసాగింది. ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కేంద్రాల వద్ద బారులు తీరి ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. అక్కడక్కడా ఈవీఎంల మొరాయింపువంటి చిన్న చిన్న ఘటనలు మినహా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా సాగింది. జిల్లా వ్యాప్తంగా మూడు నియోజకవర్గాల పరిధిలో 74.87 పోలింగ్ శాతం నమోదైంది.

### పోలింగ్ శాతం పెరిగే అవకాశం..

జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 5 దాటినా తర్వాత కూడా కొన్ని చోట్ల ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో క్యూలో ఉండడంతో, కొంతమేర పోలింగ్ శాతం పెరిగే అవకాశాలున్నాయి. జిల్లాలో 6,87,952 మంది ఓటర్లుండగా, ఇందులో 3,55,629 మంది మహిళలు, 3,32,293 పురుషులు ఉన్నారు. జగిత్యాల నియోజకవర్గంలో 73.54 శాతం, కోరుట్లలో 73.68, ధర్మపురిలో 77.5శాతం మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. కోరుట్ల నియోజకవర్గంలో 262 పోలింగ్ స్టేషన్లు, జగిత్యాలలో 254, ధర్మపురి నియోజకవర్గంలో 269 స్టేషన్లు ఉన్నాయి. కోరుట్ల నియోజకవర్గంలో 2,36,726 మంది ఓటర్లున్నారు. ఇందులో మహిళలు 1,23,692 మంది ఉండగా, పురుషులు 1,13,030 ఉండగా, 73.68 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. జగిత్యాలలో 2,26,635 మంది ఓటర్లుండగా, మహిళలు 1,17,315 మంది, పురుషులు 1,09,300 ఉన్నారు. వీరిలో 73.54 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ధర్మపురి నియోజకవర్గంలో 2,24,591 మంది ఓటర్లుండగా, 1,14,622 మంది మహిళలు, 1,09,963 మంది పురుషులు ఉన్నారు. వీరిలో 77.50 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో కలెక్టర్ యాస్మిన్ భాషా, అదనపు కలెక్టర్ బీఎస్ లత తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీఆర్ఎస్ జగిత్యాల ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాంలో, కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డి జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాలలో, బీజేపీ అభ్యర్థి బోగ శ్రావణి పురాణిపేట హైస్కూల్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా, జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా ముగియడానికి పోలీసులు తమ వంతు కృషి చేశారు. ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ మాన్ పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు చర్యలు చేపట్టారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలను నూకపెల్లి వీఆర్‌కే కళాశాలకు భారీ బందోబస్తు మధ్య తరలించారు.

### ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాం : కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగాచ స్వేచ్ఛగా జరిగాయని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలింగ్ ప్రక్రియ పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా వెల్లడించారు. గురువారం జరిగిన పోలింగ్ సందర్భంగా జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లో ఉదయం నుంచే ఓటర్లు పెద్ద ఎత్తున బారులు తీరి ఉత్సాహంగా ఓటింగ్ లో పాల్గొన్నారని తెలిపారు. మూడు నియోజకవర్గాల్లో ఇప్పటివరకు అందిన సమాచారం మేరకు 74.87 శాతం మంది ఓటు వేశారని పేర్కొన్నారు. జగిత్యాల నియోజకవర్గంలో 73.54 శాతం, కోరుట్ల నియోజకవర్గంలో 73.68 శాతం, ధర్మపురి నియోజకవర్గంలో 77.50 శాతం పోలింగ్ నమోదైందని తెలిపారు. జిల్లాలోని 785 పోలింగ్ కేంద్రాల్లో, జిల్లా యంత్రాంగం, పోలీసుల సహకారంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగిందని పేర్కొన్నారు. జిల్లాలో మహిళా, దివ్యాంగుల, యువతకు సంబంధించిన మోడల్ పోలింగ్ కేంద్రాలు 36 ఏర్పాటు చేశామని వివరించారు. కాగా, గురువారం ఉదయం 7 గంటలకల్లా ధరూర్ క్యాంపులోని 177 పోలింగ్ బూత్‌లో అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలిసి వెళ్లి, మొదటగా తమ ఓటు హక్కును వినియోగించున్నామని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా వివరించారు. జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో నియోజకవర్గం వారీగా వెబ్ కాస్టింగ్ ఏర్పాటుచేసి పర్యవేక్షించామని, ఏ చిన్న లోటుపాట్లు ఉన్నా కూడా వెంటనే గుర్తించిన అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు సరిచేసిందని పేర్కొన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలో ఏర్పాటు చేసిన జిల్లా వెబ్ కాస్టింగ్ కేంద్రాన్ని, మీడియా మానిటరింగ్ సెల్‌ను సందర్శించి పోలింగ్ ప్రక్రియలను కలెక్టర్ పర్యవేక్షించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజీవ్ రంజన్ మీనా, హెచ్ బసవ రాజేంద్ర, పోలీస్ పరిశీలకులు వివేకానంద సింగ్ ఎన్నికల నిర్వహణ తీరుపై కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్ కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షించారు. కార్యక్రమాలలో జిల్లాలోని అధికారులు, సిబ్బంది, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మేడిపల్లి: వల్లంపల్లిలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళ ఓటర్లు